క్లుప్తంగా

పోచమ్మ దేవాలయంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

పహాడీషరీఫ్: అమవాస్యను పురస్కరించుకొని పహాడీషరీఫ్‌లోని పోచమ్మ దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కెఎస్ ప్రశాంత్, సూర్య గౌడ్, శంకర్ యాదవ్, ఈదులకంటి విశాల్ గౌడ్, చింటూ, నవీన్ చారి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ



డీకే అరుణను సన్మానిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ ఎంపీలను మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు గురువారం సన్మానించి అభినందించారు. మహబూబ్‌నగర్ నుంచి బీజేపీ ఎంపీగా గెలిచిన డీకే అరుణ, మల్కాజిగిరి నుంచి విజయం సాధించిన ఈటల రాజేందర్‌ను కలిసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. మోదీ నాయకత్వంలో ఆయా పార్లమెంట్ నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు పున్న భిక్షపతి, జంగారెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొఘలులను ఎదిరించిన ధీశాలి ఛత్రపతి శివాజీ

ఘనంగా రాజ్యాభిషేక్ దినోత్సవం



నివాళులర్పిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన గొప్ప ధీశాలి ఛత్రపతి శివాజీ మహారాజ్ అని శివసేన యూత్ అసోసియేషన్ ప్రతినిధులు కొనియాడారు. శివాజీ రాజ్యాభిషేక్ దినోత్సవం సందర్భంగా గురువారం జల్‌పల్లి శ్రీరాం కాలనీలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాజీ తన జీవిత కాలంలో మొఘల్ సామ్రాజ్యం, గోల్కొండ సుల్తానేట్, బీజాపూర్ సుల్తానేట్, యూరోపియన్ వలస శక్తులతో పోరాడారన్నారు. సామ్రాజ్యం తరపున ఎన్నో సైనిక దండయాత్రలను ఎదుర్కొన్నారన్నారు. పురాతన హిందూ రాజకీయ సంప్రదాయాలు, కోర్టు సమావేశాలను పునరుద్ధరించిన ఘనత అతనికే దక్కుతుందన్నారు. నేటి తరం శివాజీ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, అసోసియేషన్ సభ్యులు శాంత కుమార్, షేర్ సింగ్, అంబదాస్, నర్సింగ్ బిరాదర్, రాహుల్ బిరాదర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోండి

కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి



నాలాను పరిశీలిస్తున్న కమిషనర్ వాణిరెడ్డి

పహాడీషరీఫ్: వర్షాకాలాన్ని పురస్కరించుకొని కచ్చామోరీలు, నాలాలో వ్యర్థాల తొలగింపు చేపట్టి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందిని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి ఆదేశించారు. మున్సిపాలిటీలోని పలు బస్తీల్లో పర్యటించి ఓపెన్ నాలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురిసినప్పుడు వరద నీరు సాఫీగా వెళ్లకపోతే ఇళ్లల్లోకి నీరు చేరుతుందన్నారు. అంతేకాకుండా లోతట్టు ప్రాంతాలు జలమయంమవుతాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని అన్ని నాలాల్లో వ్యర్థాలను తొలగించేలా సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. అన్ని ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల మూతలు మూసి ఉంచడంతో పాటు భారీ వర్షాలు కురిసినప్పుడు సిబ్బందిని అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఇషత్ ఆయేషా, వర్క్ ఇన్‌స్పెక్టర్ రతన్ పాల్గొన్నారు.



కందుకూరు: లేమూరులో బడి బాట ప్రారంభిస్తున్న ఎంపీడీఓ సరిత



తుక్కుగూడ: రావిర్యాలలో ఉపాధ్యాయుల ర్యాలీ

బడీడు పిల్లలను బడిలో చేర్పించండి

తుక్కుగూడ: బడి ఈడు పిల్లలను పాఠశాల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు గురువారం మండల వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జయ శంకర్ బడిబాట కార్యక్రమాని మున్సిపాలిటీ వ్యాప్తంగా ఉపాధ్యాయులు ప్రారంభించారు. మొదటి రోజు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటా తిరిగి ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, చేపడుతున్న విద్యాప్రమాణాల గురించి తల్లిదండ్రులకు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు దాటిన చిన్నారులను బడికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: లేమూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు హెచ్ నరసింహా ఆధ్వర్యంలో ఎంపీడీఓ సరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాం, ఉచిత భోజనం ప్రతి విద్యార్థికి ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన ఉంటుందన్నారు. గతేడాది కూడా ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం సరఫరా చేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్లపై ఇసుక మేటల తొలగింపు

బడంగ్‌పేట్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారుల్లో చాలా చోట్ల ఇసుక మేటలు పేరుకపోయి ప్రమాదాలకు నిలయంగా మారాయి. దీన్ని గుర్తించిన బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సిబ్బందితో శుభ్రంచేయిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైరుతి రుతుపవనాలు తెలంగాణను తాకడంతో వాతావరణం చల్లబడిందన్నారు. అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో కూడా వర్షాలు కురుస్తున్నాయన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై చెత్తా, చెదారం చేరడమే కాకుండా ఇసుక పేరుకపోతుందన్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రహించి సిబ్బందితో ఇసుకను ఎత్తిస్తున్నామన్నారు. వారం క్రితం ఎమ్మార్వో కార్యాలయం వద్ద, అలాగే పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ ఎదురుగా ప్రధాన రహదారిలో కొత్త మున్సిపల్ కార్పొరేషన్ మూలమలుపు వద్ద ఇసుక పేరుకపోయిందన్నారు. గుర్తించిన అధికారులు వెంటనే ఇసుకను ఎత్తివేయించారన్నారు. ఇటీవల ఈ ఇసుక మేటల వల్ల బైకులు అదుపుతప్పిన ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ విషయాన్ని గమనించిన కార్పొరేషన్ అధికారులు ప్రధాన రహదారిలో ఎక్కడ కూడా పేరుకుపోయిన వెంటనే గుర్తించి పారిశుధ్యసిబ్బందితో ఇసుకను తొలగించే పనులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రమాదాలను నివారించేందుకు సిబ్బంది చేస్తున్న సేవలను వాహనదారులు, పలు కాలనీలవాసులు హర్షం వక్తం చేస్తున్నారు.



ప్రధాన రహదారిపై ఇసుక మేటలను తొలగిస్తున్న పారిశుధ్యసిబ్బంది

యువత రక్తదానం చేయాలి

బీజేపీ సీనియర్ నేత ఆచారి



రక్తదానం చేసిన యువకులను అభినందిస్తున్న ఆచారి

ఆమనగల్లు: యవతీ, యువకులకు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని బీజేపీ సీనియర్ నేత ఆచారి కోరారు. ఆయన జన్మదినం సందర్భంగా ఆమనగల్లు పట్టణంలోని గాంధీచౌక్ వద్ద బీజేవైఎం మరియు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 153 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన నాయకులు, యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు పట్టణ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, కల్వకుర్తి బీజేవైఎం కన్వీనర్ అనిల్, కోకన్వీనర్ రాజశేఖర్, మీడియా ఇన్‌చార్జి రవిరాథోడ్, రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు కొప్పు బాషా, రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు యాదీష్, ఉపాధ్యక్షుడు కండె సాయి, రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్, నాయకులు మహేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు లక్ష్మణ్, శ్రీశైలంయాదవ్, చెన్నకేశవులు, విజయ్‌కృష్ణ, శేఖర్, నర్సింహ, సందీప్, శ్రీనివాస్, చందు, అశోక్, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆమనగల్లు బస్టాండ్ వద్ద బీజేపీ నాయకులు ప్రజలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి గ్రామాలను పచ్చని వనాలుగా మార్చాలని బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ సీనియర్ నేత ఆచారి పుట్టిన రోజు వేడుకలను ఆ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి



గురూజీ ఇస్తున్న సందేశం, ప్రవచనాలు ఆసక్తిగా తిలకిస్తున్న భక్తులు

కందుకూరు: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి పేర్కొన్నారు. ప్రతి నిత్యం భగవంతుడి సాధనలో కొంత సమయం గడిపితే, ఆధునిక సమాజంలో ఆటుపోట్లను తట్టుకుని నిలబడే శక్తి లభిస్తుందని ఆయన సూచించారు. అమావాస్యతో పాటు శని జయంతిని పురస్కరించుకుని గురువారం మండలంలో పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో గురూజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమస్యలు, రోగాల 'నివారణ కోసం ప్రత్యేకంగా హోమం, పూర్ణాహుతి చేశారు. అనంతరం భక్తులకు గురూజీ ఆశీర్వాదాలతో పాటు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచనాలు, సందేశం ఇచ్చారు. సమస్యలు లేని జీవితం అనేది ఉండదని, ఆ సమస్యలను ఎదుర్కొని, పరిష్కరించుకునే మార్గం భగవంతుడి సాధనతోనే సాధ్యమవుతుందన్నారు. మానవ సేవయే మాధవ సేవగా భావించి తోటి వారితో స్నేహభావంతో మెలుగుతూ అందరితో కలిసిమెలిసి సంతోషంగా జీవించేలా తమను తాము తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జీపీలకు నిధులివ్వండి

మాడ్గుల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు నిధులు సకాలంలో అందించకపోవడంతో అభివృద్ధి పనులు ముందుకెళ్లడం లేదని ఎంపీపీ గౌరవరం పద్మారెడ్డి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. గ్రామాలకు నిధులు మంజూరు చేయక దాదాపు రెండు సంవత్సరాలు అవుతోందని సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులకు బాధ్యతలు అప్పజెప్పారాని చెప్పారు. అయితే పంచాయతీ సిబ్బందికి దాదాపు 6నెలలుగా జీతాలు అందలేదని ఎంపీపీ తెలిపారు. వెంటనే జీపీలకు నిధులు విడుదల చేయాలని కోరారు. ఎంపీటీసీలు పాండుగౌడ్, నారమ్మ,లక్ష్మమ్మ పాల్గొన్నారు.

డ్రైనేజీలు పొంగకుండా చర్యలు తీసుకోండి



జలమండలి అధికారులకు డ్రైనేజీ సమస్య వివరిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: వర్షాలకు పలు కాలనీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి జలమండలి అధికారులను కోరారు. బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు డివిజన్ పరిధిలోని నాగార్జున కాలనీ, క్రిస్టియన్ కాలనీ పరిసర కాలనీల్లో డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. ఈ విషయంపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆయన జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం రాజగోపాల్, మేనేజర్ భవ్య, జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రజ్ఞ అధికారులతో కలిసి ఆయా కాలనీల్లో పర్యటించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీలు పూడుకుపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ వారికి సూచించారు. కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు లట్టుపల్లి మోహన్‌రెడ్డి, నాయిని శ్రీకాంత్‌రెడ్డి, హరీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కమిషనర్‌తోనే సరి



తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం

- ఇక్కడి కమిషనర్ సత్యనారాయణరెడ్డిపై మే లో సస్పెన్షన్ వేటు
- ఇన్‌చార్జి కమిషనర్‌గా మీర్‌పేట కమిషనర్‌కు అదనపు బాధ్యతలు
- పని ఒత్తిడితో కేటాయించలేకపోతున్న వైనం
- సకాలంలో పనులు కాక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తుర్కయంజాల్: పురపాలక సంఘానికి పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ ఇదివరకు కమిషనర్‌గా పనిచేస్తున్న బి.సత్యనారయణ రెడ్డి మే21న సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. దీంతో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చంద్రశేఖర్‌కు ఇక్కడి అదనపు బాధ్యతలను సీడీఎంఏ కేటాయించింది. దీంతో ఆయన రెండు చోట్లా పనిచేయాల్సి రావడంతో తుర్కయంజాల్‌కు ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారు. దీంతో పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి వచ్చేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. రోజుల తరబడి తిరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

అనుమతుల జారీలో జాప్యం

భవన నిర్మాణ అనుమతులు, అసెస్‌మెంట్, మ్యూటేషన్, బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ వంటి వాటికి రోజుల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా వాటిని జారీ చేయాల్సి ఉన్నప్పటికీ పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఇన్‌చార్జి కమిషనర్ కార్యాలయానికి సమయం కేటాయించకపోవడం, పని ఒత్తిడితో ఎక్కడిక్కడ ఫైల్‌లు పేరుకుపోయాయి. కార్యాలయ సిబ్బంది ఫైల్స్ పట్టుకుని మీర్‌పేటకు రోజూ తిరగాల్సి వస్తోంది.

శానిటేషన్ అస్తవ్యస్తం

మున్సిపాలిటీకి పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో శానిటేషన్ అస్తవ్యస్థంగా మారింది. పలు కాలనీల్లో రోడ్ల పక్కన చెత్తను ఇష్టానుసారంగా వేస్తుండటంతో డంపింగ్ యార్డ్‌లుగా మారుతున్నాయి. సిబ్బందిపై పర్యవేక్షణ కరువైంది. ఇటీవల తుర్కయంజాల్‌లోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఓ వ్యక్తిపై కుక్క దాడి చేయడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. అదే కుక్క 10రోజుల తర్వాత గాయపడిన వ్యక్తి తల్లిని కూడా కరిచి గాయపరిచింది. అయినప్పటికీ అధికారుల స్పందన కరువైంది.

కోడ్ ముగియడంతో..

లోక్‌సభ ఎన్నికల కోడ్ ఈనెల 6వ తేదీతో ముగియడంతో సీడీఎంఏ అధికారులు పూర్తిస్థాయి కమిషనర్‌ను కేటాయించడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. గతంలో ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన పలువురు మరోసారి ఇక్కడికి రావడానికి ఇప్పటికే ప్రయత్నాలు మొదులు పెట్టినట్లు తెలుస్తుంది. వెంటనే అధికారులు స్పందించి పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.



డంపింగ్ కేంద్రాలుగా ఖాళీ ప్రదేశాలు

- రోడ్లు, ఖాళీ ప్లాట్లలో పారబోత
- చెత్తను తొలగించని సిబ్బంది
- ప్లాస్టిక్ మయంగా రోడ్లు



ఇంజాపూర్ రోడ్డు పక్కన దర్శనమిస్తున్న చెత్త

హయత్‌నగర్: ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కొందరు ఇష్టానుసారంగా చెత్తను పడేస్తున్నారు. ఖాళీ ప్లాట్లు, రోడ్లకు ఇరువైపులా ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేస్తుండటంతో హయత్‌నగర్ డివిజన్‌లో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారుల నిర్లక్ష్యంతో సిబ్బంది చెత్తను తొలగించడంపై అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. హయత్‌నగర్ నుంచి మునుగనూరు, కుంట్లూర్, సాహెబ్‌నగర్ వెళ్లే దారులకు ఇరువైపులా చెత్త కుప్పలు దర్శనమిస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పలు కాలనీలలో ఉన్న ఖాళీ ప్రదేశాలు, కుమ్మరికుంట, బాతుల చెరువుల్లో చెత్తను వేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు చెత్తను పడేస్తున్నారు. చెత్తను పడేసేందుకు వాడుతున్న ప్లాస్టిక్ సంచుల కారణంగా రోడ్లన్నీ ప్లాస్టిక్ మయంగా మారుతున్నాయి. రోడ్ల పక్కన చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.